## అధ్యాయము 13

# విమోచనా దినమును మరియు ఎఱ్ఱ సముద్రమునకు ప్రయాణమును జ్ఞాపకము చేసికొనుట

13వ అధ్యాయము నిర్గమము యొక్క కథను కొనసాగిస్తుంది, మొదటిగా ఆ సంఘటనను జ్ఞాపకము చేసికొను నిమిత్తము కొన్ని నిర్దేశములను బయలుపరచింది మరియు ఆ తరువాత అరణ్యములోనికి వెళ్లుటలో ఇశ్రాయేలీయుల తదుపరి అడుగును గూర్చిన మరికొన్ని వివరములను ఇస్తుంది. విమోచన కార్యము యొక్క పర్యావసానములను ఇస్తున్న అధ్యాయముగా ఈ అధ్యాయమును పరిగణించవచ్చు. ఇశ్రాయేలు ప్రజలు విమోచింపబడ్డారు గనుక, ప్రజలకు బాధ్యతలు ఇవ్వబడ్డాయి: (1) వారి ప్రథమ సంతతిని యెహోవాకు ఇవ్వడం, (2) పులియని రొట్టెల పండుగలో ఆరాధన చేయడం, మరియు (3) వాగ్దాన దేశము వైపునకు తమ ప్రయాణమును కొనసాగించడం.

మనుష్యుల యూక్క పశువుల యొక్కయు ప్రథమ సంతతిని తనకొరకు ప్రతిష్ఠించునట్లుగా మరియు వారి విమోచనా దినమునకు జ్ఞాపకార్థముగా ఇవ్వాలని చెప్తూ ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశమును విడచి వెళ్లినప్పుడు యెహోవా మోషేతో మాట్లాడాడు (13:1, 2). పస్కాను ఆచరింపవలయునని వారికి చెప్తూ అప్పుడు మోషే ప్రజలతో మాట్లాడాడు (13:3). పులియని రొట్టెల పండుగను ఆచరించు విధానము, అలాగే ఈ పండుగ సందర్భమును ఆధారము చేసికొని దేవుడు ఇశ్రాయేలు ప్రజలను విడిపించిన విధానమును ఇశ్రాయేలీయులు తమ పిల్లలకు వివరించాలని కూడా మరిన్ని నిర్దేశములను మోషే ప్రజలకు ఇచ్చాడు (13:4-10). అప్పుడు దేవుడు మోషే ద్వారా ఇశ్రాయేలు ప్రజలలోని ప్రథమ సంతతిని ప్రతిష్టించుటను గూర్చి మాట్లాడుతూ - ఏమి అర్పించాలి, ఎలా అర్పించాలి మరియు ఎందుకు అర్పించాలి అనే విషయాలను మరింత వివరంగా చెప్పాడు. మరొక సారి, తమ విమోచనా కథనమును తమ పిల్లలతో పంచుకొనుటకు ఈ సందర్భము ఇశ్రాయేలు ప్రజలకు ఉపక్రమిస్తుంది (13:11-16).

ఐగుప్తు దేశమునుండి బయలు దేరిన ప్రజలు ఏ మార్గము గుండా వెళ్లారు ("ఎఱ్ఱ

సముద్రపు అరణ్యమార్గమున"), వారితో ఏమేమి తీసుకెళ్లారు ("యోసేపు యొక్క యెముకలు"), ఎక్కడికి వారు వెళ్లారు (సుక్కోతు నుండి ఏతాము వరకు), మరియు ఏ విధంగా వారు నడిపింపబడ్డారు ("పగలు మేఘ స్తంబము" ద్వారా మరియు "రాత్రి అగ్ని స్తంబము" ద్వారా) అనే విషయములను చెప్పుట ద్వారా ఈ అధ్యాయము తదుపరి భాగము కొనసాగుతుంది (13:17-22).

## విమోచనా దినమును జ్ఞాపకము చేసికొనుట (13:1-16)

### ప్రథమ సంతతిని ప్రతిష్టించుట (13:1, 2)

**1మరియు యెహోవా మోషేతో ఈలాగు సెలవిచ్చెను - 2ఇశ్రాయేలీయులలో మనుష్యుల యొక్కయు పశువులయొక్కయు ప్రథమ సంతతి, అనగా ప్రతి తొలిచూలు పిల్లను నాకు ప్రతిష్టించుము; అది నాదని చెప్పెను.**

**వచనములు 1, 2.** వారు సుక్కోతునకు ప్రయాణమైన తరువాత (12:37)గాని[1] లేదా వారు గోషెనును విడుచుటకు సిద్ధపడుతుండగా కాని, ఇశ్రాయేలు ప్రజల యొక్క **ప్రథమ సంతతి**ని గూర్చి **యెహోవా మోషేతో** కొన్ని ఉపదేశములు చేశాడు. "ప్రథమ సంతతి" అంటే **ప్రతి గర్భము యొక్క తొలిచూలు**గా (פֶּטֶר כָּל־רֶחֶם, *peter kol rechem*) నిర్వచించబడింది. ఈ మాటలను మరింత అక్షరార్థముగా "గర్భమును మొదటిగా తెరచునది ఏదైతే ఉన్నదో అది" (KJV; NKJV చూడండి) అని అనువదించవచ్చు. ఈ ప్రథమ సంతతిని 15వ వచనము "ప్రథమ కుమారులు"గా చెప్తుంది. తమ ప్రథమ సంతతి వారిని ఇశ్రాయేలీయులు యెహోవా కొరకు **ప్రతిష్టించాలి.** "ప్రతిష్టించుట" (קָדַשׁ, *qadash*) అనే పదమునకు అర్థము "ప్రత్యేకపరచుట" లేదా "పరిశుద్ధ పరచుట." ఈ విధంగా ప్రథమ సంతతిని ప్రతిష్టించుటలో గల ఆంతర్యం ఏమంటే, దేవుడు ఇశ్రాయేలు యొక్క మనుష్యులలో మరియు జంతువులలో ప్రథమ సంతతిని కాపాడాడు గనుక, అవి ఆయనకు చెందినవి అని (13:15; సంఖ్యా. 3:13; 8:17, 18).

బహుశా, 1 మరియు 2 వచనములలో దేవుడు మోషేకు ఇచ్చిన ప్రత్యక్షత యొక్క నివేదిక ఒక వీక్షణంగా ఉంది: ప్రథమ సంతతిని ప్రతిష్టించుటను గూర్చి దేవుడు మోషేతో మాట్లాడాడు అని పాఠ్యము చెప్తుంది. పిమ్మట, ఆ తదుపరి భాగాలలో, ఆ పండుగను ఎలా జరుపుకోవాలి (13:3-10) మరియు ప్రథమ సంతతిని ఎలా "ప్రతిష్టించాలి" లేదా "ఇచ్చి వేయాలి" (NIV) (13:11-16) అనే విషయాలను మోషే ప్రజలతో చెప్పాడు.

### మోషే యొక్క ఉపన్యాసం (13:3-16)

**3మోషే ప్రజలతో నిట్లనెను - మీరు దాసగృహమైన ఐగుప్తునుండి బయలుదేరివచ్చిన దినమును జ్ఞాపకము చేసికొనుడి. యెహోవా తన బాహు**

**బలముచేత దానిలోనుండి మిమ్మును బయటికి రప్పించెను; పులిసిన దేదియు**
**తినవద్దు. 4అబీబను నెలలో ఈ దినమందే మీరు బయలుదేరి వచ్చితిరిగదా. 5యెహోవా**
**- నీ కిచ్చెదనని నీ పితరులతో ప్రమాణము చేసినట్లు, కనానీయులకు హిత్తీయులకు**
**అమోరీయులకు హివ్వీయులకు యెబూసీయులకు నివాసస్థానమై యుండు, పాలు**
**తేనెలు ప్రవహించు దేశమునకు నిన్ను రప్పించిన తరువాత నీవు ఈ ఆచారమును ఈ**
**నెలలోనే జరుపుకొనవలెను. 6ఏడు దినములు నీవు పులియని రొట్టెలను తినవలెను,**
**ఏడవ దినమున యెహోవా పండుగ ఆచరింపవలెను. 7పులియని వాటినే యేడు**
**దినములు తినవలెను. పులిసినదేదియూ నీయొద్దకనబడ కూడదు. నీ**
**ప్రాంతములన్నిటిలోను పొంగినదేదియు నీయొద్ద కనబడకూడదు. 8మరియు ఆ**
**దినమున నీవు - నేను ఐగుప్తులోనుండి వచ్చినప్పుడు యెహోవా నాకు చేసినదాని**
**నిమిత్తము పొంగని రొట్టెలను తినుచున్నానని నీ కుమారునికి తెలియచెప్పవలెను.**
**9యెహోవా ధర్మశాస్త్రము నీ నోట నుండునట్లు బలమైన చేతితో యెహోవా**
**ఐగుప్తులోనుండి నిన్ను బయటికి రప్పించెననుటకు, ఈ ఆచారము నీ చేతిమీద నీకు**
**సూచనగాను నీ కన్నుల మధ్య జ్ఞాపకార్థముగా ఉండును. 10కాబట్టి ప్రతి సంవత్సరము**
**ఈ కట్టడను దాని నియామక కాలమున ఆచరింపవలెను. 11యెహోవా నీతోను నీ**
**పితరులతోను ప్రమాణము చేసినట్లు ఆయన కనానీయుల దేశములోనికి నిన్ను చేర్చి**
**దాని నీకిచ్చిన తరువాత 12ప్రతి తొలి చూలుపిల్లను, నీకు కలుగు పశువుల సంతతిలో**
**ప్రతి తొలిపిల్లను యెహోవాకు ప్రతిష్టింపవలెను. వానిలో మగ సంతానము యెహోవా**
**దగును. 13ప్రతి గాడిద తొలిపిల్లను వెలయిచ్చి విడిపించి దానికి మారుగా గొఱ్ఱెపిల్లను**
**ప్రతిష్టింపవలెను. అట్లు దానిని విడిపించనియెడల దాని మెడను విరుగదీయవలెను. నీ**
**కుమారులలో తొలిచూలియైన ప్రతి మగ వానిని వెలయిచ్చి విడిపింపవలెను.**
**14ఇకమీదట నీ కుమారుడు - ఇది ఏమిటని నిన్ను అడుగునప్పుడు నీవు వాని చూచి -**
**బాహుబలముచేత యెహోవా దాసగృహమైన ఐగుప్తులోనుండి మనలను బయటికి**
**రప్పించెను. 15ఫరో మనలను పోనియ్యకుండ తన మనస్సును కఠినపరచుకొనగా**
**యెహోవా మనుష్యుల తొలిసంతానమేమి ఐగుప్తుదేశములో తొలిసంతాన మంతయు**
**సంహరించెను. ఆ హేతువుచేతను నేను మగదైన ప్రతి తొలిచూలు పిల్లను యెహోవాకు**
**బలిగా అర్పించుదును; అయితే నా కుమారులలో ప్రతి తొలి సంతానము వెలయిచ్చి**
**విడిపించుదునని చెప్పవలెను. 16బాహుబలము చేత యెహోవా మనలను**
**ఐగుప్తులోనుండి బయటికి రప్పించెను గనుక ఆ సంగతి నీ చేతిమీద సూచన గాను నీ**
**కన్నుల మధ్య లలాట పత్రికగాను ఉండవలెను అని చెప్పెను.**

**వచనము 3.** మునుపు, దేవుడు మోషేతో మాట్లాడాడు (12:1) మరియు మోషే పెద్దలతో మాట్లాడాడు (12:21), వీరు తిరిగి మోషే యొక్క మాటలను ప్రజలకు తెలిపారు (12:28). 13వ అధ్యాయములో, **మోషే ప్రజలతో** నేరుగా మాట్లాడినట్లు తెలుస్తుంది. తన ఉపన్యాసములో ఉద్ఘాటన దేనిని సూచిస్తుందంటే **బాహు బలముచేత యెహోవా** ఇశ్రాయేలీయులను ఐగుప్తునుండి బయటకు రప్పించినప్పుడు ఏమైతే జరిగినవో వాటిని వారు నిరంతరము **జ్ఞాపకము చేసికొనుటను** సూచిస్తుంది. పులియని రొట్టెల పండుగను ఆచరించుట ద్వారా వారు ఆ సందర్భమును జ్ఞాపకము చేసుకోవాలి.

**వచనము 4. ఈ దినమందే . . . మీరు బయలుదేరి వచ్చితిరి గదా** అనే మాటలతో ఈ భాగము మొదలవుతుంది, మరియు ఈ జ్ఞాపకార్థ పండుగే వార్షిక పండుగ కూడా కావాలి అని మోషే చెప్పుటతో ఈ భాగము ముగుస్తుంది (13:10). **అబీబను నెలలో** వారి యొక్క విమోచన మొదటిగా జరిగినది అని వారు జ్ఞాపకము చేసుకోవాలి. “అబీబు అనే నెల” 12:2లో “సంవత్సరములో మొదటి నెల”కు సమానముగా ఉంది. אָבִיב (*'abib*) అను హెబ్రీ పదము “క్రొత్తవైన, లేత వెన్నుల”ను సూచిస్తుంది[2] (9:31; లేవీయ. 2:14); ఈ నెలలోనే గింజలు ముదిరి కోతలు ప్రారంభమవుతాయి. “అబీబు” అనేది మొదటి నెలకు ఉన్న పూర్వ నామము, మరియు తరువాత దీనికిచ్చిన పేరు “నిసాను.” “నిసాను” అనేది సుస్పష్టంగా బబులోను యొక్క క్యాలెండరు నుండి తీసికొనబడింది, అలాగే మిగిలిన హెబ్రీ మాసముల పేరులు కూడా. బబులోను చెర కాలము తరువాత వ్రాయబడిన పుస్తకములలోనే ఈ పేరులు ఈ విధంగా కనబడతాయి (నెహెమ్యా 2:1; ఎస్తేరు 3:7).

**వచనము 5.** వారు వెళ్లనైయున్న ఆ **దేశము**లోనే వారి విమోచనను ఇశ్రాయేలీయులు జ్ఞాపకము చేసుకొనవలసినవారిగా ఉన్నారు. ఆ దేశము కనీసము అయిదు వివిధ జాతులచే ఆక్రమించుకొనబడిన దేశము: **కనానీయులు, హిత్తీయులు, అమోరీయులు, హివ్వీయులు మరియు యెబూసీయులు** (3:8bపై గల వ్యాఖ్యలను చూడండి). ఈ ప్రాంతము అప్పటికే ఆక్రమించబడి ఉంది అనే వాస్తవము అంత సులువుగా ఆ దేశము ఇశ్రాయేలు ప్రజల చేతికి రాదు అనే విషయాన్ని చెప్పకనే చెప్తుంది. అదే సమయములో, ఇది **పాలు తేనెలు ప్రవహించు దేశము** అనే వాస్తవము అది ఫలభరితమైనది మరియు వృద్ధి చెందినది అని, అలాగే దాని కొరకు కష్ట పడటం వృధా ప్రయాస కాదనే విషయాన్ని కూడా చెప్తుంది (3:7, 8aపై గల వ్యాఖ్యలను చూడండి). ఇశ్రాయేలీయుల **పితరులకు** (అబ్రాహాము, ఇస్సాకు మరియు యాకోబు) తమ సంతానమునకు (ఇశ్రాయేలీయులకు) ఈ దేశమును ఇస్తాను అని దేవుడు వాగ్దానము చేశాడు.

**వచనము 6.** వారు ఇప్పుడు అనుభవిస్తున్న ఆ గొప్ప ఘటనను పులియని రొట్టెలు అనే పండుగను ఆచరించుట ద్వారా ప్రజలు జ్ఞాపకము చేసుకోవాలి. **ఏడు దినములు** వారు **పులియని రొట్టెలను తినవలెను** (12:15 చూడండి). **ఏడవ దినమున** వారు **యెహోవా దినమును ఆచరించాలి.** మునుపు ఇవ్వబడిన నిర్దేశములలో, “మొదటి దినమున” మరియు “ఏడవ దినమున” కూడా “పరిశుద్ధ సంఘము”గా కూడుకోవాలి అని చెప్పబడింది (12:16).

**వచనము 7. యేడు దినములు పులియని రొట్టెలను** తినడం కంటే మించి, ఇశ్రాయేలీయుల మధ్యలో **పులిసిన దేదియు** కనబడకూడదు. తమ గృహముల నుండి పులిసినది ఏదైనా ఉంటే దానిని తొలగించమని మునుపు వారు చెప్పబడ్డారు; ఈ విధంగా చేయుటలో విఫలమైతే వారు “ఇశ్రాయేలీయులలో నుండి కొట్టివేయబడును” అని చెప్పబడింది (12:15). కనాను దేశములో స్థిరపడిన తరువాత, పులిసినదేదియు **వారి ప్రాంతములన్నిటిలో** కనబడకూడదు.

**వచనము 8.** పస్కా పండుగ విషయములో చెప్పబడినట్లుగానే (12:26, 27), ఈ

పులియని రొట్టెల పండుగ కూడా బోధించే ఒక సాధనముగా ఉపయోగపడాలి. ఒక తండ్రి తన కుమారునితో: **నేను ఐగుప్తులోనుండి వచ్చినప్పుడు యెహోవా నాకు చేసినదాని నిమిత్తము పొంగని రొట్టెలను తినుచున్నాను** అని చెప్తాడు.

**వచనము 9. యెహోవా ధర్మశాస్త్రమును** అందరు తెలిసికొని బోధించుటకు ఈ పండుగ అందరికి ఒక అవకాశమును ఇస్తుంది; దేవుడు చేసిన దానిని ఇది వారికి సాదృశ్యకముగా చెప్పడమే కాకుండా అది జ్ఞాపకము కూడా చేస్తుంది. 9వ వచనములో **ఈ ఆచారము నీ చేతిమీద నీకు సూచనగాను నీ కన్నుల మధ్య జ్ఞాపకార్థముగా ఉండును** అనే మాటలు 16వ వచనములో ఉన్న “నీ చేతిమీద సూచన గాను నీ కన్నుల మధ్య లలాట పత్రికగాను ఉండవలెను” అనే మాటలను పోలినవిగా ఉన్నాయి (ద్వితీ. 6:8; 11:18 చూడండి). బబులోను చెర నుండి తిరిగి వచ్చినది మొదలుకొని యేసు దినముల వరకు (మత్తయి 23:5), మరియు ఈ ఆధునిక కాలములో కూడా, ఈ మాటలను యూదులు అక్షరార్థముగానే వివరిస్తూ వచ్చారు, అందువలన తమ నుదుటులపై మరియు ఎడమ చేతులపై చిన్న పెట్టెలు ఉండే తోలు పట్టీలను (వీటినే phylacteries అంటారు), వీటిలో కొన్ని వాక్యభాగాలను మోస్తున్నారు (నిర్గమ. 13:1-10, 11-16; ద్వితీ. 6:4-9; 11:13-21).[3] ఇట్లుండగా, ఈ మాటలు సాదృశ్యకముగానే తీసుకొనుటకు ఇవ్వబడ్డాయి అని తెలుసుకోవాలి.[4] అలాగైతే, ఈ మాటల అర్థం ఈ విధంగా ఉండొచ్చు: “ఈ మాటలను చాలా దగ్గరగా ఉంచుకోండి. ఈ ధర్మశాస్త్రము మీ దైనందిన జీవితములలో, మీ క్రియల్లోనూ ఆలోచనల్లోనూ భాగముగా ఉండనివ్వండి” అని అర్థాన్ని ఇస్తుండొచ్చు.



తోలు పట్టీలు ధరించిన యూదులు పశ్చిమాన ఉన్న గోడ వద్ద (యెరూషలేము)

**వచనము 10.** పులియని రొట్టెల పండుగ అనునది వార్షిక పండుగగా జరుపుకొనవలసి ఉంది. **సంవత్సరమునకు** ఒకసారి, వారి విమోచనను వారికి జ్ఞాపకము చేస్తూ దేవుని ధర్మశాస్త్రమును అనుసరించి నడచుటకు ఒక జ్ఞాపకార్థ పండుగ అనేది ఇశ్రాయేలీయులను పురికొల్పుతుంది.

**వచనము 11.** ఈ పండుగను జరుపుకొనుటతో పాటు, తమ ప్రథమ సంతతినిలోని కుమారులను దేవునికి ప్రతిష్టించుట ద్వారా కూడా ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశమునుండి పొందిన విమోచనను జ్ఞాపకము చేసుకోవాలి. **యెహోవా** తమ పితరులకు ఇస్తానని వాగ్దానము చేసిన కనాను **దేశము**ను వారు స్వీకరించిన తరువాత ఈ వ్యవస్థ మొదలవుతుంది.

**వచనము 12.** "పవిత్ర"ముగా పుట్టిన తొలిచూలు పిల్లలలోని **మగవి** అన్నియు - అనగా, బలికి అనువైనవి అన్నియు కూడా - దేవునికి అర్పించవలసినవిగా ఉన్నాయి. ధర్మశాస్త్రములోని ఇతర వాక్యభాగములు "పవిత్ర"మైన మరియు "అపవిత్ర"మైన జంతువులను గూర్చి మాట్లాడుతున్నాయి (లేవీయ. 11:3-7; ద్వితీ. 14:3-8). ఇది ఒక పురాతనమైన విబేధము, ఎందుకంటే పవిత్రమైన జంతువులు అపవిత్రమైన జంతువులనుండి వేరుచేయబడింది జలప్రళయము జరిగినప్పుడే (ఆది. 7:2, 8). ఈ పవిత్రమైన జంతువులలోని తొలిచూలు పిల్లలు ("ఎద్దులు" మరియు "గొఱ్ఱెలు") పుట్టిన తరువాత ఏడు దినములు తమ తల్లివద్దనే ఉండి ఆ తరువాత ఎనిమిదవ దినమున యెహోవాకు బలిగా అర్పించబడాలి అని నిర్గమ. 22:30 స్పష్టము చేస్తుంది. తొలిచూలుల యొక్క రక్తము బలిపీఠముపై ప్రోక్షింపబడుతుంది, దాని క్రొవ్వు యెహోవా కొరకు కరిగించబడుతుంది, మరియు దాని మాంసము యాజకులచే భుజించబడుతుంది (సంఖ్యా. 18:17, 18).

**వచనము 13.** ఒకవేళ ఆ జంతువు అపవిత్రమైనదై యుండి బలికి యోగ్యమైనది కానియెడల, అంటే ఒక **గాడిద** లాంటిదైతే[5], అప్పుడు ఆ జంతువు ఒక **గొఱ్ఱె**తో వెలయిచ్చి **విడిపింపవలెను.** ఇతర మాటలలో చెప్పాలంటే, దాని కొరకు ఒక గొఱ్ఱెను గాని లేదా గొఱ్ఱెపిల్లను గాని ఇచ్చి దానికి ప్రతిక్షేపించాలి (12:3, 4పై గల వ్యాఖ్యలను చూడండి). దీనికి బదులుగా, దాని యజమాని దాని నుండి లబ్ది పొందకుండ ఉండునట్లుగా దానిని చంపాలి. **దాని మెడ విరుగగొట్ట**వలెనని అతడు ఆజ్ఞాపించబడ్డాడు, ఈ విధంగా చేయుట ద్వారా ఆ జంతువు నుండి రక్తము స్రవించే అవకాశం ఉండదు గనుక. తరువాతి కాలంలో ధర్మశాస్త్రములో, అపవిత్రమైన జంతువులను ఈ విధంగా విడిపించుటకుగాను అవి ఒక నెల వయసు కలిగి ఉన్నప్పుడు ఐదు తులముల వెండి వెలగా చెల్లించాల్సిందిగా నిర్ణయించబడింది (సంఖ్యా. 18:15, 16).

ఇశ్రాయేలు ప్రజల **తొలిచూలులలో మగవారిని** కూడా **వెలయిచ్చి విడిపింప**వలసినదిగా చెప్పబడ్డారు. కనానీయులచే నరబలులు అర్పించబడినప్పటికీ, అట్టి ఒక ప్రయోగమును దేవుడు ఎన్నడు ఆమోదించలేదు (లేవీయ. 18:21; 20:2-5; ద్వితీ. 12:31; 18:10).[6] దేవుడు ఇశ్రాయేలీయుల యొక్క గృహములను "దాటి వెళ్లినప్పుడు" వారి పిల్లలను కాపాడాడు గనుక, ఒక విధంగా చూస్తే ఆ తొలిచూలు

పిల్లలు దేవునికే చెందినవారు. దీనికి జ్ఞాపకార్థంగా, ఇశ్రాయేలీయులు వారిని "విడిపించాలి" - అంటే వారిని తిరిగి కొనుక్కోవాలి. ఆ తొలిచూలు కుమారుడు ఒక నెల వయసుగలవాడై ఉన్నప్పుడు వాని యొక్క వేల ఐదు తులముల వెండి (సంఖ్యా. 18:15, 16). జ్యేష్ఠకుమారుని ప్రతిష్టించే ఈ విధమైన ప్రయోగము యేసు యొక్క జనన కథనములో, అనగా ఆయన ఒక నెల వయసు ఉండగానే దేవాలయములోనికి తీసుకొనిపోబడినప్పుడు, జరిగినట్లు చూడగలం (లూకా 2:23, 24).

**వచనములు 14, 15.** తొలిచూలియైన జంతువులను బలిగా ఇవ్వడం మరియు తొలిచూలు కుమారులను విడిపించడం అనేవి ఇశ్రాయేలీయుల యొక్క పిల్లలకు బోధించుటకు కూడా సందర్భాలుగా ఉన్నట్లు చెప్పొచ్చు (12:26, 27; 13:8 చూడండి). తన తండ్రి తొలిచూలియైన ఒక గొర్రెను అర్పించునప్పుడు లేదా ఆ గాడిద యొక్క మెడను విరుగగొట్టినప్పుడు చిన్నవాడైన తన **కుమారుడు** ఆశ్చర్యంతో చూస్తూ, "నీవు ఈ పని ఎందుకు చేయుచున్నావు?" అని అడుగుతాడు.

ఆ కుటుంబము పస్కా పండుగను ఆచరించునప్పుడు ఏ విధమైన సమాధానం ఇవ్వబడినదో ఇక్కడ ఇవ్వవలసిన సమాధానం కూడా దానిని పోలినదిగానే ఉంది. "కుమారుడా, **యెహోవా** మనలను **ఐగుప్తు** దేశమునుండి విడిపించాడు గనుక మనమీలాగు చేయుచున్నాము" అని తండ్రి తన కుమారునితో చెప్తాడు. అప్పుడు జరిగిన ఉదాంతం అంతా చెప్పడానికి ఆ తండ్రి ఉపక్రమిస్తాడు: "ప్రజలు **వెళ్లుటకు ఫరో** నిరాకరించాడు. కాబట్టి, దేవుడు ఐగుప్తీయుల యొక్క **తొలిచూలు** సంతానమును **సంహరించి** ఇశ్రాయేలీయుల యొక్క బిడ్డలను రక్షించాడు. ఫలితముగా, ఇశ్రాయేలు వారు తమ **తొలిచూలులను** యెహోవాకు ప్రతిష్టిస్తారు. దేవుడు ఇశ్రాయేలును **బాహుబలము** చేత విడిపించాడు. ప్రజలు పిరికిగా బయటకు రాలేదు లేదా ఏదో అతికష్టం మీద బయటకు అడుగుపెట్ట లేదు. కాని, దేవుడు చేసిన గొప్ప సూచనలు మరియు మహాత్కార్యముల వలన ఇశ్రాయేలు వారు విజయోత్సవముతో బయటకు కదిలి వచ్చారు!" అని తండ్రి కుమారునితో చెప్తాడు.

వచనము **16.** ఈ విధంగా, బోధించుటకు అనుకూలించు ఇట్టి కొన్ని ప్రశ్నోత్తరాల ద్వారా, ఇశ్రాయేలీయుల యొక్క విశ్వాసము ఒక తరము నుండి మరొక తరము వరకు వ్యాప్తి చెందవలసినదిగా ఉంది. తొలిచూలును అర్పించుటను గూర్చి ఇవ్వబడిన నిర్దేశములలోని ఉద్దేశము ఏమనగా ఇశ్రాయేలీయుల యొక్క విమోచనా చరిత్రను ప్రజల యొక్క మనస్సులకు దగ్గరగా ఉంచుడమే. **గనుక ఆ సంగతి నీ చేతిమీద సూచన గాను నీ కన్నుల మధ్య లలాట పత్రికగాను ఉండవలెను** (13:9పై గల వ్యాఖ్యలను చూడండి).

## ఎఱ్ఱ సముద్రమునకు ప్రయాణము (13:17-22)

**[17]మరియు ఫరో ప్రజలను పోనియ్యగా దేవుడు - ఈ ప్రజలు యుద్ధము చూచునప్పుడు వారు పశ్చాత్తాపపడి ఐగుప్తుకు తిరుగుదురేమో అనుకొని, ఫిలిష్తీయుల దేశము సమీపమైనను ఆ మార్గమున వారిని నడిపింపలేదు. [18]అయితే దేవుడు**

**ప్రజలను చుట్టుదారియగు ఎఱ్ఱసముద్రపు అరణ్యమార్గమున నడిపించెను. ఇశ్రాయేలీయులు యుద్ధ సన్నద్ధులై ఐగుప్తులోనుండి వచ్చిరి. [19]మరియు మోషే యోసేపు ఎముకలను తీసికొని వచ్చెను. అతడు - దేవుడు నిశ్చయముగా దర్శనమిచ్చును; అప్పుడు మీరు నా ఎముకలను ఇక్కడనుండి తీసికొని పోవలెనని ఇశ్రాయేలీయుల చేత రూఢిగా ప్రమాణము చేయించుకొని యుండెను. [20]వారు సుక్కోతునుండి ప్రయాణమై పోయి, అరణ్యము దగ్గరనున్న ఏతాములో దిగిరి. [21]వారు పగలు రాత్రియు ప్రయాణము చేయునట్లుగా యెహోవా త్రోవలో వారిని నడిపించుటకై పగటివేళ మేఘస్తంభములోను, వారికి వెలుగిచ్చుటకు రాత్రివేళ అగ్నిస్తంభములోను ఉండి వారికి ముందుగా నడచుచు వచ్చెను. [22]ఆయన పగటివేళ మేఘస్తంభమునైనను రాత్రివేళ అగ్ని స్తంభమునైనను ప్రజలయెదుటనుండి తొలగింపలేదు.**

ఐగుప్తు నుండి ఇశ్రాయేలీయులు బయటకు వచ్చినప్పుడు వారు నడచిన మార్గము, వారితో తీసికెళ్లిన వస్తువులు, వారు వెళ్లిన స్థలములు, వారు దేవునిచే నడిపింపబడిన విధానము ఇవన్నియు కూడా నిర్గమకాండము యొక్క కథనము మరింత విపులంగా మనకు తెలుపుతుంది (13:17-22).

**వచనము 17. ఫిలిష్తీయులదేశము సమీపమైనను ఆ మార్గమున** దేవుడు వారిని నడిపింపలేదు, “ఈ మార్గమే యెష 9:1లో ‘సముద్ర మార్గము’గా చెప్పబడింది; ఈ పేరు లాటిన్ పదమైన *Via Maris* అనే మాటను పోలినది, మరియు రోమీయుల కాలమునుండే ఈ పదము ప్రయోగములో ఉంది.”[7] మధ్యధరా తీరము నుండి ఉత్తరాది “మార్గము” ఐగుప్తు నుండి కనాను వెళ్లుటకు చాలా సమీపమైన మార్గముగా ఉండేది. దేవుడు వేరొక మార్గమును ఎంచుకొనుటకు గల కారణమును ఈ పాఠ్యము ఇస్తుంది: **ఆ ప్రజలు** ఇంకను యుద్ధము చేయుటకు సిద్ధముగా లేరు మరియు ఫిలిష్తీయుల యోధులను ఎదుర్కోవడం అంటే వారు నిరుత్సాహ పడి, ఆఖరుకు వారిని **ఐగుప్తు దేశమునకు తిరిగి వెళ్లునట్లు** చేస్తుంది అని తెలుపబడింది.[8] వారికంటే ఉన్నతమైన సైనిక బలగమును ఎదుర్కొన్నప్పుడు నిరుత్సాహపడే వారి తత్వం తరువాతి సందర్భములో ఒకసారి కనాను దేశమును వేగు చూచుటకు పంపబడిన ఆ పండ్రెండ్రు మందిని చూస్తే అర్థమవుతుంది (సంఖ్యా. 13:32-14:4). ఇందునుబట్టి ఇశ్రాయేలీయులు వేరొక మార్గమున ప్రయాణించవలసినవారై ఉన్నారు.

ఈ వచనములో మరియు ఇతర చోట్ల “ఫిలిష్తీయుల” యొక్క ప్రస్తావన (15:14; 23:31) కొంత ఇబ్బందిని కలిగిస్తుంది. వాస్తవంగా ఫిలిష్తీయులు పాలస్తీనా దేశము యొక్క తీర ప్రాంతములలో ఉన్నప్పటికీ కూడా, చాల వరకు పురావస్తు ఆధారముల ప్రకారముగా క్రీ.పూ. 1200 వరకు కూడా వారు అక్కడ స్థిరపడిన వారు కారని తెలుస్తుంది. ఈ సమస్యను వివరించుటకు అనేకమైన పరిష్కారములు ప్రతిపాదించబడ్డాయి.

మొదటిగా, ఇశ్రాయేలీయుల యొక్క నిర్గమము అనునది క్రీ.పూ. 1200 తరువాత జరుగవలసినది అని కొంతమంది వాదన. కాని, ఈ కాలము అధికమంది బైబిల్ పండితులు ప్రతిపాదిస్తున్న కాలమునకు - క్రీ.పూ. 1290 అను సంవత్సరమును ప్రతిపాదించే పండితులతో సహా - చాలా తరువాతగా ఉంది.

రెండవదిగా, నిర్గమకాండము పుస్తకము మోషే కాలమునకు చాలా తరువాతనే రచించబడింది మరియు ఇక్కడ ఇవ్వబడిన "ఫిలిష్తీయులు" అనే పదము కేవలము ఒక కాలజ్ఞాన దోషముగా ఉన్నది అని మరికొంత మంది పండితుల వాదన. కాని, పంచగ్రంథములను మోషేనే రచించాడని లేఖన భాగములే చెప్తున్నాయి.

మూడవదిగా, మోషే పంచగ్రంథములను వ్రాసిన తరువాత, ఒక సంపాదకుడు లేదా లేఖికుడు ఈ యొక్క పనిని, "ఫిలిష్తీయులు" అనే యొక్క సరిక్రొత్త పదముతో జతకలిపి మోషే వ్రాసిన రచనకు కొంత మెరుగులు దిద్దాడు అనే ఆలోచనను కొంతమంది బలపర్చారు. చదువరి ఈ మాటను అర్థము చేసుకొనుటకు గాను ఈ మార్పును చేసి ఉంటారు.[9]

నాలుగవ మరియు ఆఖరు వివరణ ఏదనగా ఆ కాలమునకే కొంతమంది ఫిలిష్తీయులు ఆ ప్రాంతములో ఉన్నారు, కాని పురావస్తుశాఖ వారు సరిగా వారి యొక్క ప్రసన్నతను పసిగట్టలేక పోయి ఉంటారు అనే వాదన.[10] మరో విధంగా చెప్పాలంటే, చాలా కాలముగా ఈ ఫిలిష్తీయులు అనువారు కనాను దేశమునకు దశలు దశలుగా వలసలు వచ్చారు. ఈ నిర్గమకాండమునకు అనేక వందల సంవత్సరములు పూర్వము జీవించిన అబ్రాహాము మరియు ఇస్సాకు (ఆది. 21:32; 26:1) కథనములలో కూడా ఫిలిష్తీయులను గూర్చిన ప్రస్తావన ఉండడం అనేది గమనార్హం.

**వచనము 18.** "ఫిలిష్తీయులు ఉండునట్టి మార్గము గుండా" వెళ్లుట కాకుండా, ఇశ్రాయేలీయులు **చుట్టుదారియగు ఎఱ్ఱసముద్రపు అరణ్యమార్గమున** నడిపింపబడ్డారు. ("ఎఱ్ఱ సముద్రము" ను గూర్చిన అధిక సమాచారము కొరకు, చూడండి *అనుబంధం: నిర్గమకాండము యొక్క మార్గము.*) ఇంకా చూస్తే, వారు **యుద్ధ సన్నద్ధులై** వెళ్లారు (חֲמֻשִׁים, *chamushim*). వారు "యుద్ధము కొరకు సన్నద్ధంగా ఉన్నారు" అని NIV అంటుండగా, NRSV అనువాదము "వారు యుద్ధము కొరకు ఆయుధులై ఉన్నారు" అని వివరిస్తుంది. దీనికి అర్థము ఇశ్రాయేలీయులు మరీ ఎక్కువగా కాకపోయినా కూడా కొంతమేర ఆయుధములను కలిగి ఉన్నారని. కొన్ని వడిసెలలు మరియు రాళ్లు, విల్లులు మరియు బాణములు, అలాగే ఈటెలు కూడా వారివద్ద ఉండియుండవచ్చు. అయినప్పటికీ కూడా, అమాలేకీయులను జయించుటకు ఇశ్రాయేలీయులు కొన్ని కత్తులను కూడా ప్రయోగించారు అని నిర్గమ. 17:13 మనకు తెలుపుతుంది. ఇశ్రాయేలీయులు "పోరాడుటకు సిద్ధముగా, అనగా, బాగా ఆయుధులైన యోధులు ముందు నడువగా, వారిపై ఆధారపడిన బలహీనులు అందరు వీరి వెనుక వీరి సంరక్షణలో ముందుకు సాగారు" అని John I. Durham అనే రచయిత వివరించాడు.[11] వారు ఖచ్చితంగా కొంతమంది శత్రువులను ఎదుర్కొంటారు మరియు వారితో పోరాడవలసి వస్తుందనే విషయము దేవుని ప్రజలకు ముందుగానే తెలిసినట్లుగా అనిపిస్తుంది.

**వచనము 19.** వారు బయటకు వచ్చినప్పుడు, వారు **యోసేపు యెముకలను** [వారితో కూడా] **తెచ్చారు**, బహుశ ఈ యెముకలు పీనుగగా మారిన తరువాత తేటడి ఉంటాయి. ఆది. 50:25లో యోసేపు యొక్క చివరి కోరిక మేరకు ఈ విధంగా చేయబడినది, ఆ మాటలనే ఇక్కడ 19వ వచనములో మరలా చూడగలం: **మీరు నా**

**ఎముకలను ఇక్కడనుండి తీసికొని పోవలెను.** విశ్వాసముతో యోసేపు ఈ మాటలను చెప్పాడు (హెబ్రీ. 11:22), తన పితరులతో దేవుడు చేసిన వాగ్దానములను ఆయన నమ్మాడు (ఆది. 50:24). దేవుడు తన వాగ్దానములను నిలుపుకుంటాడు అని అనడానికి యోసేపు యెముకలు ఐగుప్తు నుండి తీసికొని రాబడడమే ఒక నిదర్శనం, ఎందుకంటే ఇశ్రాయేలు దేశమును ఐగుప్తు నుండి బయటకు రప్పించి కనాను దేశమునకు తీసికొని వెళ్తానని దేవుడు ముందుగానే చెప్పాడు (ఆది. 15:13-16). నిర్గమములో, ఈ ప్రతిజ్ఞనే ఆయన నిలుపుకున్తున్నాడు. కనానును స్వాధీనపరచుకొనిన తరువాత, యోసేపు యొక్క అవశేషములు షెకెములో పాతిపెట్టబడ్డాయి (యెహో. 24:32).

**వచనము 20. సుక్కోతు** తరువాత, ఇశ్రాయేలు వారి యొక్క ప్రయాణములో తరువాతి మజిలీ **ఏతాము**, అది **అరణ్యమునకు దగ్గరగా** ఉంది. ఎఱ్ఱ సముద్రమునకు చేరే ముందు ఇదే వారి పై ఒక్క ఆఖరు అడుగు (14:2 చూడండి).

**వచనములు 21, 22.** వారు వెళ్లుచుండగా, **పగటి కాలమందు దేవుడు మేఘస్తంభమును** మరియు **రాత్రి కాలమందు అగ్ని స్తంభమును** వారికి మార్గమును చూపులాగున మరియు **రాత్రి**యందు వారు ప్రయాణించునట్లు వీలుగా ఇచ్చాడు (సంఖ్యా. 9:15-23 చూడండి). వారి ప్రయాణపు ప్రతి అడుగులో, దేవుని నడిపింపును ఇశ్రాయేలీయులు చూచారు. పాత నిబంధనలో తరచూ దేవుడు మేఘము మరియు/లేదా అగ్నిచే సూచించబడుతున్నాడు.

## అన్వయము

### పస్కా నుండి మనకు వర్తించే పాఠములు (13:3)

మోషే ద్వారా దేవుడు ఇశ్రాయేలుకు "ఈ దినమును జ్ఞాపకము చేసికొనుడి" అని చెప్పాడు (13:3). జ్ఞాపకముంచుకొనవలసిన దినమేదనగా దేవుని ప్రజలు ఆ పదియవ తెగులు నుండి తప్పింపబడి ఐగుప్తు నుండి విడిపింపబడిన దినము.

దాని ఆవిర్భవములో, పస్కా పండుగ ఇశ్రాయేలీయుల విశ్వాసము యొక్క కుటుంబ కోణాన్ని ఉద్ఘాటించేది. ప్రతి ఒక్క కుటుంబము ఒక గొఱ్ఱెను ఎంచుకొని, దాని యెముకలలో దేనిని విరువకుండా దానిని సాయంత్రం వేళ వధించి, దానిని వేయించి, దానిని మొత్తముగా తినాలి. ఒకవేళ ఆ ఇంటిలో ఆ గొఱ్ఱెను మొత్తముగా తినుటకు చాలా తక్కువ మందే ఉన్నట్లయితే, అప్పుడు రెండు కుటుంబాలు కలిసి తినవచ్చు. ఆ గొఱ్ఱెపిల్ల యొక్క రక్తమును తమ యిండ్ల గుమ్మములమీదను ద్వారబంధకములమీదను వారు ప్రోక్షించాలి. దేవుడు తమ యిండ్లపై ఆ రక్తమును చూచినప్పుడు, ఆయన ఆ యింటిని "దాటిపోయి" సంహారకుడు ఆ యింటికి ప్రవేశించకుండా చూచేవాడు. ఈ పస్కా పశువును తినేవారు తన వస్త్రములను పాదరక్షలను ధరించి తమ కర్రలను చేతపట్టి (12:11), సత్వరముగా వెళ్లుటకు సిద్ధముగా ఉండేవారు.

సంవత్సరములు గడవగా, ఇశ్రాయేలీయులు తమ పిల్లలకు వారి విమోచనా క్రమమును గూర్చి వివరించుటకు ఈ వేడుక ఉపయోగపడింది. ఈ పండుగలలో ప్రతి ఒక్క దానిలో చేయవలసినది ఏమంటే దేవుడు వారిని బంధకముల నుండి విడిపించిన తీరు, ఐగుప్తీయుల మొదటి సంతానము నాశనము చేయబడగా ఇశ్రాయేలీయుల యొక్క మొదటి సంతానము రక్షింపబడడం, మున్నగు విషయములను జ్ఞాపకము చేసికోవడమే.

ఈ పస్కా నుండి నేటి క్రైస్తవులు ఎట్టి పాఠములను నేర్చుకొనగలరు? పస్కా పండుగను గూర్చి ఆలోచించే ప్రతి ఒక్క క్రైస్తవుడు ఈ క్రింది వాటిని చేయడానికి ప్రోత్సహించబడాలి:

*కుటుంబ ఆరాధన యొక్క ప్రాముఖ్యతను గుర్తించడం.* మనము ఆరాధించుటకు కూడినప్పుడు, మనము ఒక కుటుంబముగా, దేవుని కుటుంబముగా ఆరాధన చేస్తాము. దీనికి తోడు, మనము మన యిండ్లలో మన కుటుంబములన్నిటితో కలిసి ఆరాధన చేయాలి. మన పిల్లలతో కలిసి పాడడం ప్రార్థించడం మరియు ఇంటిలో వారికి ఉపదేశించడం, అనగా పస్కా పండుగ సందర్భముగా ఇశ్రాయేలీయులు తమ బిడ్డలకు చేసినట్లుగానే, మనము కూడా చేయాలి.

*రక్షణలో క్రీస్తు యొక్క పాత్రను గుర్తుంచుకోవడం.* క్రీస్తును గూర్చి పౌలు “మన పస్కా బలి”గా మాట్లాడాడు (1 కొరింథీ. 5:7). యేసు “దేవుని గొఱ్ఱెపిల్ల” (యోహా. 1:29, 36), “వధింపబడిన గొఱ్ఱెపిల్ల” (ప్రకటన 5:12). యేసు మచ్చలేని వాడిగా ఉన్నాడు (నిర్గమ. 12:5; 1 పేతురు 1:18, 19), ఆయన యెముకలలో ఒకటి కూడా విరువబడలేదు (నిర్గమ. 12:46; యోహా. 19:36), మరియు ఆయన రక్తము దేవుని యెదుట ఒక సూచనగా ఉండుటను (నిర్గమ. 12:13) బట్టి క్రీస్తు కూడా ఒక పస్కా గొఱ్ఱెపిల్ల వలెనే ఉన్నాడు. పస్కా వలెనే, ఆయన జ్ఞాపకార్థమై చేయు వేడుకలో కూడా పులియని రొట్టె ఉంది (నిర్గమ. 12:18; 1 కొరింథీ. 5:8).[12]

*మన విమోచనను జ్ఞాపకము చేసుకొనుట యొక్క విలువను గమనించడం.* ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశమునుండి విడిపింపబడిన విధమును జ్ఞాపకము చేసికొను నిమిత్తము పస్కా పండుగ ఇవ్వబడింది. ఇదే రీతిలో ప్రభురాత్రి భోజనము కూడా, పస్కా పండుగ నేపథ్యంలోనే వ్యవస్థీకరించబడింది, యేసు మరణమును మరియు ఆయన మరణము ద్వారా మనకు వచ్చిన రక్షణను జ్ఞాపకము చేసికొను నిమిత్తము స్మృత్యర్థంగా ఇవ్వబడింది (లూకా 22:19; 1 కొరింథీ. 11:24, 25). యేసు మనకొరకు చేసిన దానిని మనము నిరంతరము జ్ఞాపకమునకు తెచ్చుకోవాలి.

*మనమందరము ఒక ప్రయాణములోనే ఉన్నామనే విషయమును జ్ఞాపకముంచుకోవడం.* ఇశ్రాయేలీయులు పస్కా పశువును వధించి తినిన తరువాత తమ ప్రయాణము కొరకు సిద్ధపడినట్లుగానే, క్రైస్తవులు కూడా ఈ భూమిలో యాత్రికులము మరియు పరదేశులము అయి ఉన్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రభువు భోజనములో పాల్గొనుట ద్వారా ఆయన మరణమును జ్ఞాపకము చేసికొనునప్పుడు ఈ లోకము వైపు కాక తన రెండవ రాకడ నిమిత్తము మనమందరము కనిపెట్టునట్లు అది మనలను సిద్ధపరచాలి.

*ముగింపు.* ఇశ్రాయేలీయులు మాత్రమే ఈ పస్కా పండుగలో పాల్గొనవలసినవారై ఉన్నారు. కాగా ప్రభువు భోజనము అనునది ప్రభువు దినమున ప్రభువు సంఘములో ప్రభువు యొక్క ప్రజల ద్వారా ఆచరించబడాలి అనే విషయం ప్రజలకు ఇది జ్ఞాపకము చేయాలి. మన పస్కా బలి వలన కలుగు ప్రయోజనములలో పాల్గొనదలచిన వారు మరియు ప్రభువు భోజనములో సహవాసము పొందదలచిన వారు ఆత్మీయమైన ఇశ్రాయేలు అనగా ప్రభువు యొక్క సంఘములో సభ్యులై ఉండవలెను.

## "బాహుబలము" (13:3, 9, 14, 16)

దేవుని యొక్క "బాహుబలము" చేత ఇశ్రాయేలీయులు విడిపింపబడ్డారు. వివిధమైన అనువాదములలో ఆయన శక్తి "బలమైన హస్తము" (NIV), "దృఢమైన హస్తము" (NRSV), లేదా "చేతి బలము" (KJV; NRSV) ఈ విధంగా అనువదించబడింది. తన ప్రజలకు సహాయము చేయు నిమిత్తము సమముకాని తన బలమును ప్రయోగించు దేవుని అర్థము చేసికొనుటకు ఈ వచనములు మనకు సహాయపడతాయి. కాని, దేవుని యొక్క హస్తము నాశనము నిమిత్తము (ఐగుప్తునకు వ్యతిరేకముగా) అలాగే విమోచన నిమిత్తము కూడా (ఇశ్రాయేలు కొరకు) బాహుబలమైనదిగా ఉందని మనము జ్ఞాపకము చేసికోవాలి. ఐగుప్తీయులను దండించిన దేవుని హస్తమును మనము జ్ఞాపకము చేసికొన్నప్పుడు, "జీవముగల దేవుని చేతిలో పడుట భయంకరము" అని చెప్పే హెబ్రీయులకు పత్రిక 10:31 వచనమును కూడా మనము ఎల్లప్పుడు మనస్సులో ఉంచుకోవాలి.

## దేవుడే మనలను నడిపించునట్లు అర్పించుకోవడం (13:17, 18)

దేవుడు ఇశ్రాయేలు యొక్క పిల్లలను నడిపించాడు, మరియు ఈనాడు కూడా ఆయన మనలను నడిపించాలని అనుకుంటున్నాడు. దేవుడు నానా విధాలుగా తన పిల్లలను నడిపిస్తుంటాడు.

కొన్నిసార్లు దేవుడు మనలను చుట్టిన మార్గములో నడిపిస్తుంటాడు (13:17, 18). అత్యంత సులువైన మార్గము కొన్నిసార్లు శ్రేష్టమైన మార్గము కాకపోవచ్చు. దేవుడు ఇశ్రాయేలీయులను సంరక్షించుటకు మరియు వారిని సిద్ధపరచుటకు కూడా వారిని చుట్టిన మార్గములో నడిపించాడు.

కొన్నిసార్లు దేవుడు మనలను త్రోవ యొక్క అంతము వద్దకు కూడా నడిపిస్తాడు (14:8-10). ఈ విధంగా అంత్యమార్గములు కొన్నిసార్లు దేవుని నిర్దేశము కొరకు మరియు ఆయన విమోచన కొరకు కనిపెట్టునట్లు చేస్తాయి. "ప్రభువు నొద్దకు తప్ప నేను వేరు ఎటు పోగలను?" అని ఒక పాటలో పాడినట్లుగా ఉంటుంది ఇది.

అరణ్య మార్గములో కూడా దేవుడు మనలను నడిపిస్తాడు (15:22-27). మోషే మరియు ఇశ్రాయేలీయులు దేవునిపై ఆధారపడతారో లేదో అని దేవుడు పరీక్షించాడు. నేడు కూడా మనలను పరీక్షించుటకు దేవుడు ఈ విధమైన అరణ్య మార్గములను వాడుతుంటాడు.

దేవుని నడిపింపును ప్రశ్నించడం మనం ప్రారంభించినప్పుడు, ఆయన స్వాధీనంలో ఉన్నాడు మరియు మన తండ్రికి మేలైనది ఏదో తెలుసు అనే విషయాన్ని మనం జ్ఞాపకం చేసుకోవాలి (ద్వితీ. 8:2). దేవుడు మార్గమును చేయువాడు (యోహాను 14:6), పర్వతములను కదల్చువాడు (మత్తయి 17:20), సమస్యలను పరిష్కరించువాడు, మరియు భారమును లేపువాడు (1 పేతురు 5:7).[13]

## వాగ్దానములను నిలబెట్టుకోవడం (13:19)

యోసేపు యెముకలను ఐగుప్తు నుండి బయటకు తెచ్చి వాగ్దాన దేశములో వాటిని పాతిపెట్టుట ద్వారా ఇశ్రాయేలీయులు చేసిన వాగ్దానమును మోషే నిలబెట్టాడు (13:19). ఇశ్రాయేలీయులను ఐగుప్తు నుండి బయటకు రప్పించి కనాను దేశములోనికి ప్రవేశింపజేస్తానని దేవుడు చేసిన వాగ్దానమును ఆయన నిలబెట్టుకున్నాడు. "దేవుడు నమ్మదగినవాడు"; ఆయన ఎల్లప్పుడూ తన వాగ్దానములను నిలబెట్టుకొనేవాడు (1 కొరింథీ. 10:13; 2 పేతురు 3:9). తమ వాగ్దానములను ఎల్లప్పుడూ కూడా నిలబెట్టుకొనే యథార్థవంతులైన ప్రజలగా క్రైస్తవులు ఉండాలి (మత్తయి 5:37).

---

సూచనలు

[1]Walter C. Kaiser ప్రకారం ఈ ప్రత్యక్షత జరిగిన స్థలము సుక్కోతు. Walter C. Kaiser, Jr., "Exodus," in *The Expositor's Bible Commentary*, vol. 2, *Genesis-Numbers* (Grand Rapids, Mich.: Zondervan, 1990), 382, and Wilbur Fields, *Exploring Exodus*, Bible Study Textbook Series (Joplin, Mo.: College Press, 1976), 277. [2]Francis Brown, S. R. Driver, and Charles A. Briggs, *The Brown-Driver-Briggs Hebrew and English Lexicon* (Boston: Houghton, Mifflin and Co., 1906; reprint, Peabody, Mass.: Hendrickson Publishers, 1997), 1. [3]అధిక సమాచారము కొరకు Roger L. Omanson, "Phylactery," in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1986), 3:864-65లో చూడండి. [4]దీనిని గూర్చి R. Alan Cole ఒక "స్వచ్ఛమైన రూపకాలంకారముగా" మాట్లాడాడు. (R. Alan Cole, *Exodus: An Introduction and Commentary*, Tyndale Old Testament Commentaries [Downers Grove, Ill.: Inter-Varsity Press, 1973], 114.) [5]ఈ నియమము విషయములో John I. Durham అనే రచయిత ఒక భిన్నమైన వివరణను ప్రతిపాదించాడు. "మగదైన గాడిద అపవిత్రమైనదిగా ఎంచబడినట్లు [పాత నిబంధనలో] ఖచ్చితమైన ఆధారము ఎక్కడా కూడా లేదు (లేవీయ. 11:1-8 see) - భారమైన బరువులను మోయుటకు ఉపయోగించే ఒక విలువైన సాధనం అది (నిర్గమ. 9:3 సూచన చూడండి)." దానికున్న ప్రయోగాత్మకమైన విలువ వలన, 12వ వచనములో పేర్కొనబడిన సాధారణ నియమము నుండి అది మినహాయించబడింది. (John I. Durham, *Exodus*, Word Biblical Commentary, vol. 3 [Waco, Tex.: Word Books, 1987], 179.) అయినప్పటికీ, ఇశ్రాయేలీయులకు గాడిద చాలా విలువైన ఆస్తి కాగా (20:17), దానికి చీలిక కలిగిన డెక్కలు లేనందున అది స్పష్టంగా అపవిత్రమైన జంతువుల జాబితాలో పడిపోయింది (లేవీయ. 11:3-7; ద్వితీ. 14:3-8 చూడండి). [6]తరువాతి చరిత్రలో, ఈ హేయమైన కార్యమును

ఇశ్రాయేలీయులు జరిగించారు (2 రాజులు 16:3; 17:31; 21:6; యెహె. 16:20, 21; 2 రాజులు 3:27 చూడండి). ఈ కారణమువలన వారు ప్రవక్తలచే చాలా తీవ్రంగా ఖండించబడ్డారు (యెష. 57:4, 5; యిర్మీ. 7:30-34; 19:4-9; యెహె. 16:20, 21). [7]Nahum M. Sarna, *Exploring Exodus: The Origins of Biblical Israel* (New York: Schocken Books, 1996), 105. [8]మరొక ప్రధానమైన శత్రువులెవరనగా ఈ ప్రాముఖ్యమైన మార్గము ప్రక్కలో ఉంచబడిన ఐగుప్తీయుల సైనికులు అయి ఉండవచ్చు. [9]ఆది. 14:14లో "దాను" అను ప్రస్తావన వచ్చిన నేపథ్యంలో కూడా ఇటువంటి వాదనే వచ్చింది. న్యాయాధిపతుల కాలములో ఈ పట్టణము దానీయులచే ఓడింపబడక మునుపు ఇదే పేరుతో పిలువబడేది కాదు ఈ పట్టణము (న్యాయాధి. 18:29). [10]Kaiser, 385.

[11]Durham, 185. [12]John D. Davis, "Passover," in *A Dictionary of the Bible*, 4th rev. ed. (Grand Rapids, Mich.: Baker Book House, 1957), 572. [13]Melvin Whitlock, speech in chapel, Heritage Christian University (Florence, Ala.) in 2000.